సాక్షి
సంగారెడ్డి
ఆదివారం । 5 । జనవరి । 2025



హత్య కేసులో వ్యక్తి అరెస్ట్

మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ తెలిపారు. వివరాలు 8లో ▸



ఆటో, ఏస్ వాహనం ఢీ

ఆటో- టాటా ఏస్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆరుగురికి గాయాలు అయ్యాయి. వివరాలు 8లో ▸



ఇంటి పన్ను వద్దంటున్నారు!

పంచాయతీ కార్యదర్శులు ఇంటి పన్ను వసూలు చేస్తున్నా మరికొందరు తీసుకునేందుకు ఇష్టపడటం లేదు. వివరాలు 9లో ▸

పండుగొచ్చింది పద బసవన్న

- గంగిరెద్దుల ఆటే వారికి జీవనాధారం
- చిరిగిన బట్టలు వేసుకున్నా.. గంగిరెద్దులకు అందంగా అలంకరణ
- పిల్లలతో సహా నెలల కొద్దీ వలస జీవనం
- కష్టాల కడలిలో గంగిరెద్దులవారి జీవితాలు
- ఎస్టీలుగా గుర్తించాలని వేడుకోలు

డూ డూ బసవన్న.. రా రా బసవన్నా.. అమ్మవారికి దండం పెట్టు.. అయ్యగారికి దండంబెట్టు అనగానే ముందటి కాలెత్తి సలాం చేస్తాయి. అన్నదానం...వస్త్రదానం.. ధన దానం.. గో దానం చేయడం పుణ్యం వస్తుంది.. నువ్వు ముట్టింది ముత్యం.. పట్టింది బంగారం గాను అని ఆశీర్వదించు బసవన్నా అని సల్లంగా దీవిస్తారు. ఇలా సంక్రాంతి పర్వదినాల్లో ఇంటింటికీ తిరుగుతూ గంగిరెద్దులను ఆడిస్తారు. వారు చిరిగిన వస్త్రాలు ధరించినా.. గంగిరెద్దుని మాత్రం నిత్య పెళ్లి కొడుకులా అలంకరిస్తారు. పొట్టకూటి కోసం ఊరూరా తిరగుతూ జీవనం గడుపుతున్న దయనీయ స్థితి వారిది. వారసత్వంగా, వంశపారంగా నేటికీ ఈ వృత్తిని నమ్ముకొని ఇంటింటా తిరుగుతూ భిక్షాటన చేసి బతుకీడుస్తున్నారు. గంగిరెద్దులవారి జీవితాలపై 'సాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం.

– సాక్షి, సిద్దిపేట/నంగునూరు(సిద్దిపేట)/సంగారెడ్డి జోన్



న్యూస్‌రీల్

చేపల విక్రయ సంచార వాహనం అందజేత



వాహనాన్ని అందిస్తున్న మంత్రి దామోదర, కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి: పుల్కల్ గ్రామానికి చెందిన మహిళా గ్రూప్ సభ్యురాలు బోహిని జయమ్మ, మానెమ్మలకు చేపల విక్రయ సంచార వాహనాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ అందజేశారు. మహిళా శక్తి పథకంలో భాగంగా వీరిని లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్, అడిషనల్ ఏపీఎం, డీపీఎంలు, పుల్కల్ మండల ఏపీఎం,సీసీలు, మండల సమైక్య కమిటీ సభ్యులు ఉన్నారు.

అభివృద్ధికి నిధులివ్వండి

సీఎంకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి విజ్ఞప్తి



రేవంత్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

నారాయణఖేడ్: నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి వినతిపత్రం అందేశారు. శనివారం సీఎం నివాసంలో రేవంత్‌ను కలసిన సంజీవరెడ్డి పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను మంత్రుల క్వార్టర్స్‌లో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు అక్షయ్ ఎంపిక



అక్షయ్‌ను అభినందిస్తున్న అనంత్‌రెడ్డి

సంగారెడ్డి: జనగామ జిల్లాలో నిర్వహించిన 50వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర కబడ్డీ పోటీల్లో సంగారెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించి అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన అక్షయ్ జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 8 నుంచి 11 వరకు హరిద్వార్, ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలో అక్షయ్ ఆడనున్నారు. కబడ్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, అధ్యక్షుడు ముక్తార్ జానీ, ఆర్గనైజ్ సెక్రెటరీ శివయ్య, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కమిటీ సభ్యుడు, సీనియర్ క్రీడాకారుడు శ్రీనివాస్‌రెడ్డి అక్షయ్‌ను అభినందించారు.

కేతకీలో జిల్లా ఎస్పీ పూజలు



పూజలు చేసిన జిల్లా ఎస్పీ , అధికారులు

ఝరాసంగం(జహీరాబాద్): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంలో జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ కుటుంబ సభ్యులతో కలసి ప్రత్యేక పూజలు చేశారు. శనివారం ఆలయానికి వచ్చిన వారికి ఆలయ నిర్వా హకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. గర్భగుడిలోని పార్వతీపరమేశ్వరులకు అభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వీరికి తీర్థప్రసాదాలు అందజేశారు.

7న సదరం శిబిరం

సంగారెడ్డి: సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఈ నెల 7న సదరం శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య అధికారి డాక్టర్ గాయత్రి దేవి శనివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. మీ సేవ ద్వారా స్లాట్లను బుక్ చేసుకున్నవారు మాత్రమే సదరం క్యాంపునకు హాజరు కావాలని పేర్కొన్నారు. దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మళ్లీ గజ గజ..



కోహీర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 6 డిగ్రీల ఉష్ణోగ్రత

- సంగారెడ్డి జిల్లాలో 16 మండలాల్లో ఆరెంజ్ అలర్ట్
- మెదక్ జిల్లాలోనూ ఆరు మండలాల్లో..
- చలికి వణికి పోతున్న ప్రజలు
- మరింత ఇబ్బందులుపడుతున్న వృద్ధులు, చిన్నారులు
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: చలి పులి మళ్లీ పంజా విసురుతోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. రెండు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో ప్రజలు వణికిపోతున్నారు. సాయంత్రం నాలుగైందంటే చాలు చలి ప్రభావం షురువవుతోంది. దాదాపు జిల్లా అంతటా ఇదే వాతావరణం నెలకొంది. వారం రోజుల క్రితం వరకు జిల్లాలో చలి తీవ్రత కొంత తగ్గింది. కానీ మళ్లీ ఇప్పుడు ఉష్ణోగ్రతలు భారీగా పడిపోతున్నాయి. చలి నుంచి ఉపశమనం పొందేందుకు రాత్రిళ్లు మంటలు వేసుకోవడంతో పాటు పగలు ఎండలో కూర్చుంటున్నారు.

రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు..

రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు జిల్లాలో నమోదవుతున్నాయి. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల కంటే సంగారెడ్డి జిల్లాలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం గమనార్హం. ఈ నెల 3న ఉదయం 8.30 గంటల నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు నమోదైన ఉష్ణోగ్రతలను పరిశీలిస్తే...కోహీర్‌లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. న్యాల్‌కల్‌లో 6.3 డిగ్రీలు, అందోల్ మండలం అల్మాయ్‌పేటలో 7.3 డిగ్రీలు, జహీరాబాద్ మండలం మల్చెల్మలో 7.5 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మరికొన్ని రోజులు చలి తీవ్రత ఇలాగే ఉంటుందని, పెరిగే అవకాశాలు కూడా ఉంటాయని వాతావరణశాఖ చెబుతోంది.



16 మండలాల్లో 10 డిగ్రీల కంటే తక్కువ

జిల్లాలో 14 మండలాల్లో వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. నాలుగు నుంచి పది డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత నమోదైతే ఈ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తుంది. నాలుగు డిగ్రీల కంటే తగ్గితే రెడ్ హెచ్చరికలు జారీ అవుతాయి. అయితే జిల్లాలోని కనిష్ట ఉష్ణోగ్రతలు రెడ్ అలర్ట్‌కు చేరువలో ఉండటం ఆందోళనకు గురి చేస్తోంది. పది డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదవుతున్న మండలాలను పరిశీలిస్తే..కోహీర్, న్యాల్‌కల్, జహీరాబాద్, అందోల్, పుల్కల్, జహీరాబాద్, గుమ్మడిదల, రామచంద్రాపురం, మొగుడంపల్లి, మునిపల్లి, ఝరాసంఘం, నిజాంపేట్, సిర్గాపూర్, కంగ్టి, హత్నూర, కల్హేర్ మండలాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ అయింది.

మెదక్‌లో ఆరు మండలాల్లో..

మెదక్ జిల్లా పరిధిలో ఆరు మండలాల్లో ఆరెంజ్ అలర్టు జారీ అయింది. టేక్మాల్, మనోహరాబాద్, శివంపేట, నార్సింగి, కుల్చారం, వెల్దుర్తి మండలాల్లో పది డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత నమోదు కావడంతో వాతావరణశాఖ ఈ హెచ్చరిక జారీ చేసింది.

పది డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలివే..	
కోహీర్	6 డిగ్రీలు
న్యాల్‌కల్	6.3
అల్మాయిపేట (అందోల్)	7.3
మల్చెల్మ (జహీరాబాద్)	7.5
నల్లవల్లి (గుమ్మడిదల)	7.7
అల్గోల్ (జహీరాబాద్)	7.9
బీహెచ్‌ఈఎల్	8.2
లక్ష్మీనగర్ (పుల్కల్)	8.2
మొగుడంపల్లి	8.3
నిజాంపేట్	8.5
ఝరాసంఘం	8.7
కంకోల్ (మునిపల్లి)	9.0
కడ్పాల్ (సిర్గాపూర్)	9.3
కంగ్టి	9.6
సిర్గాపూర్	9.8
హత్నూర	9.9
కల్హేర్	10

మెదక్ జిల్లాలో పది డిగ్రీల కంటే తక్కువ నమోదైన ప్రాంతాలివి	
బోడగట్ (టేక్మాల్)	8.4 డిగ్రీలు
మనోహరాబాద్	9
శివంపేట	9.4
నార్సింగి (శివునూరు)	9.7
కుల్చారం	9.7
దామరంచ (వెల్దుర్తి)	9.8

వృద్ధులు, చిన్నారులు ఇబ్బంది..

చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఎనిమిది గంటలలోపు ఇంట్లోంచి బయటకు రావాలంటే భయపడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు చలి నుంచి జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చిరువ్యాపారులు చలిని తట్టుకునేందుకు స్వెట్టర్లు, శాలువాలు కప్పుకుని పనులకు వెళ్తున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లే చిరు వ్యాపారులు ఈ చలితో అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో పాటు పొగమంచు కమ్ముకుంటోంది. దీంతో రోడ్లపై ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక లైట్లు వేసుకుని వెళ్తున్నారు.

అంధుల అక్షర ప్రదాత బ్రెయిలీ



దివ్యాంగుల ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

- ప్రతీ నెల మొదటి శనివారం దివ్యాంగులకు ప్రజావాణి
- 8న జాబ్ మేళా: కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి జోన్: తనకు అంధత్వం వచ్చిందని కుంగిపోకుండా తను చదువుకోవడంతోపాటు అంధులు చదువుకునేందుకు వీలుగా ప్రత్యేక లిపిని కనుగొన్న అక్షర ప్రదాత బ్రెయిలీ అని కలెక్టర్ క్రాంతి పేర్కొన్నారు. జిల్లా మహిళా శిశు వికలాంగుల వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం బ్రెయిలీ 216వ జన్మదిన వేడుకలు కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ హాజరై బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంధులకు బ్లైండ్ స్టిక్స్‌ను పంపిణీ చేయడంతోపాటు బ్రెయిలీ లిపి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ క్రాంతి మాట్లాడుతూ...బ్రెయిలీ లిపి ఆధారంగా కంప్యూటర్లలో బ్రెయిలీ స్క్రీన్ రీడర్‌లు, టచ్ స్క్రీన్ బ్రెయిలి పరికరాలు అభివృద్ధి చెందాయన్నారు.

ప్రజావాణిలో 14 దరఖాస్తులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణిలో 14 దరఖాస్తులు అందాయని కలెక్టర్ క్రాంతి వెల్లడించారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి ఇక నుంచి ప్రతీ నెల మొదటి శనివారం ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తామన్నారు. ఈ నెల 8న కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రత్యేక జాబ్ మేళాను నిరుద్యోగులు, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌వో పద్మజారాణి, జెడ్పీ సీఈవో జానకిరెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కె.లలిత కుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, అంధుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎస్.ప్రవీణ్ కుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు

అంతకుముందు మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు చేరేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రచార కార్యక్రమాలు, ర్యాలీలు, రంగోలి, వ్యాస రచన పోటీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వీడియో సదస్సులో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవరావు, జిల్లా రవాణా శాఖాధికారి ఎం.అరుణ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్

నారాయణఖేడ్: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను శనివారం కలెక్టరేట్‌లో ఆ సంఘం నాయకులతో కలసి కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆవిష్కరించారు.

బ్రెయిలీ లిపిలోనూ సమాచారం ఇవ్వాలి

వికలాంగుల హక్కుల జాతీయ వేదిక

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రభుత్వ సమాచారాన్ని బ్రెయిలీ లిపిలోనూ ముద్రించాలని, అంధుల హక్కుల సాధనకు మరింతగా ఉద్యమిస్తామని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడివయ్య పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేవల్ కిషన్ భవన్‌లో బ్రెయిలీ 216వ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడివయ్య మాట్లాడుతూ...లూయిస్ బ్రెయిలీ తన వ ఏట ప్రమాదవశాత్తు రెండు కళ్లను కోల్పోయి పూర్తి అంధుడిగా మారారని గుర్తు చేశారు. అంధులు తేలికగా చదవగలిగే, రాయగలిగే లిపి తయారీకి కృషి చేశారని పేర్కొన్నారు.

ప్రతిభను గుర్తించేందుకే పరీక్షలు



విజేతలుగా నిలిచిన విద్యార్థులతో డీఈవో, ఉపాధ్యాయులు

డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రతిభా పరీక్షల వల్ల పోటీతత్వం పెరగడంతోపాటు ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడతాయని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రమైన సైన్స్ కేంద్రంలో తెలంగాణ సోషల్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సోషల్ స్టడీస్ ప్రతిభా పరీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ...పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. విజయం సాధించని వారు మరోసారి గెలుపు కోసం కష్టపడాలని సూచించారు. ఈ పోటీ ల్లో 200 మంది విద్యార్థులు పాల్గొనగా వీరిలో తెలుగు, ఇంగ్లిష, ఉర్దూ మీడియాలలో ముగ్గురు చొప్పున విజేతలుగా నిలిచారు. గెలుపొందిన విద్యార్థులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. విజేతలకు 'వాసవి మా ఇల్లు'స్వచ్ఛంద సంస్థ బహుమతులను ప్రకటించింది.

రీ-ఫండ్ స్కామ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండండి

డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి



పటాన్‌చెరు టౌన్: ఆదాయపన్ను శాఖ నుంచి క్లెయిమ్ చేస్తున్నట్లుగా సైబర్ నేరస్తులు మోసపూరిత సందేశాలను, ఫిషింగ్ లింక్‌లను పంపుతున్నారని వాటిపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. పన్ను మినహాయింపు, డబ్బు వాపసు కోసం బ్యాంక్ ఖాతా వివరాలు, పాన్ నంబర్, ఆధార్ కార్డు, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు అడుగుతారని ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి వివరాలను వెల్లడించవద్దని శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారు పంపే ఫిషింగ్ లింక్‌లను క్లిక్ చేయవద్దని కూడా సూచించారు.

వివరాలన్నీ ఇక ఆన్‌లైన్‌లోనే

- మహిళా సంఘాల సభ్యుల రుణం, రికవరీ, అప్పు, పొదుపు అంశాలు
- జాతీయ జీవనోపాధి మిషన్‌లో నమోదు
- కొనసాగుతున్న నమోదు కార్యక్రమం
- జిల్లాలో 1,90,426 మంది సభ్యులు



ఝరాసంగంలో సభ్యుల వివరాలు నమోదు చేస్తున్న అధికారులు

సంగారెడ్డి జోన్: ప్రస్తుతం పోటీ పడుతున్న ప్రపంచంలో ప్రతి ఒక్క అంశం ఆన్‌లైన్‌లో లభ్యమవుతుంది. డిజిటలైజేషన్‌లో భాగంగా మహిళా సంఘాల నిర్వహణను కూడా ఆన్‌లైన్ చేస్తున్నారు. సంఘాల పనితీరు, వాటి నిర్వహణ, సమావేశాలతో పాటు తదితర వివరాలను నమోదు చేసే ప్రక్రియ ప్రారంభమైంది. కేంద్రప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్‌లో సంఘాల వివరాలను నమోదు చేస్తున్నారు.

పారదర్శకత కోసమే...

జిల్లాలో జిల్లా సమాఖ్య 1, మండల సమాఖ్యలు 25, గ్రామ సంఘాలు 695, ఆయా గ్రామాలలో 18,417 గ్రూపులున్నాయి. జిల్లాలో ఉన్న స్వయం సహాయక సంఘాల గ్రూపుల్లో 1,90,426 మంది సభ్యులున్నారు. సంఘాలకు అందించిన బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలు, రాయితీలు తదితర వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల నిధులు పక్కదారి పట్టకుండా, సంఘాల లావాదేవిలు పారదర్శకంగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సంఘాల సభ్యులకు ప్రభుత్వాలు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, గ్రామ సంఘాల రుణం, అంతర్గత రుణాలను అందిస్తున్నారు. సభ్యులు తీసుకున్న రుణం, తిరిగి చెల్లించిన రుణం, ఇంకా మిగిలిన అప్పు, జమ చేసిన పొదుపు తదితర వివరాలను నమోదు చేస్తారు. ప్రతీ సభ్యురాలి పేరు, సంఘం పేరు, ఆధార్ నంబరు, మొబైల్ నంబర్లతోపాటు సంఘ సభ్యుల ఫొటోలను అప్‌లోడ్ చేయనున్నారు.



సమావేశమైన మహిళా సంఘం సభ్యులు(ఫైల్)

లక్ష దాటితే లక్‌పతి దీదీలో నమోదు...

సభ్యురాలు ఇప్పటి వరకు తీసుకున్న రుణం లక్ష దాటితే లక్‌పతి దీదీలో నమోదు కానున్నట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు. సమావేశాలను నిర్వహించుకునే వివరాలను, ఆ సమావేశాల ఫొటోలను రుణం తీసుకుని ఏ వ్యాపారం నిర్వహిస్తున్నారు, దానికి సంబంధించిన ఫొటోలను అప్‌లోడ్ చేస్తారు.

> **ఆన్‌లైన్ ద్వారా తెలుసుకోవచ్చు**
>
> 
>
> మహిళా సంఘాల సభ్యుల పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయటం ద్వారా సభ్యుల వివరాలతో పాటు వారు తీసుకున్న రుణం, ఇంకా తీర్చాల్సిన అప్పు, వారు జమ చేసుకున్న పొదుపు తదితర వివరాలను సులువుగా తెలుసుకోవచ్చు.
>
> –జంగారెడ్డి, అదనపు డీఆర్డీవో, సంగారెడ్డి

క్లుప్తంగా

చైనా మాంజా అమ్మితే చర్యలు

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలో ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట పోలీసు కమిషనర్ డాక్టర్ అనురాధ తెలిపారు. జిల్లా పరిధిలో చైనా మాంజా విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైనా మాంజాతో మనుషులతోపాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. చైనా మాంజా అమ్మినా, రవాణా చేసినా సంబంధిత పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100కు ఫోన్ చేసి తెలపాలని సూచించారు.

అంతర్జాతీయ రంగోత్సవ పోటీలకు 36 మంది ఎంపిక



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ

తూప్రాన్: అంతర్జాతీయ రంగోత్సవ పోటీలకు మహాత్మా జ్యోతిబాపూలే వెల్దుర్తి పాఠశాల, కళాశాలకు చెంది 36 మంది విద్యార్థినులు ఎంపికయ్యారు. శనివారం ఎంఈఓ సత్యనారాయణ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ సహకారంతో గత నెలలో నిర్వహించిన జాతీయ స్థాయి రంగోత్సవ పోటీలు 177 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. ఇందులో 36 మంది విద్యార్థులు వేసిన చిత్రాలను అంతర్జాతీయ స్థాయిలో ఎంపిక చేశామన్నారు. వారికి బంగారు, వెండి, రజత పతకాలను అందజేయగా మిగితా 141 మంది విద్యార్థినులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జీఎమ్మార్ వరలక్ష్మీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్, చరణ్, నర్సంపల్లి ప్రభుత్వ పాఠశాలా ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వందన, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరు ఒకరిది.. అకౌంట్ మరొకరిది

మద్దూరులో పంపిణీ చేసిన కల్యాణ లక్ష్మీ చెక్కుల్లో తప్పుగా వివరాలు



చెక్కులతో లబ్ధిదారులు

మద్దూరు(హుస్నాబాద్): రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల్లో పేరు ఒకరిది ఉండగా.. అకౌంట్ నంబర్ మరొకరిది ఉండటంతో లబ్ధిదారులు ఆందోళనకు గురయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని వల్లంపట్ల గ్రామానికి చెందిన దేవులపల్లి లక్ష్మీ, సలాఖపూర్ గ్రామానికి చెందిన కొమ్ము కిష్టమ్మకు శనివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి చెక్కులు అందజేశారు. వెంటనే చెక్కులు తీసుకొని లబ్ధిదారులు బ్యాంక్‌కు వెళ్లారు. లబ్ధిదారులు ఇచ్చిన చెక్కులపై అకౌంట్ నంబర్ ఒకటి ఉంటే.. పేరు మరొకరిది ఉండటంతో బ్యాంక్ అధికారులు రిజెక్ట్ చేశారు. దీంతో లబ్ధిదారులు తహసీల్దార్ రహీంకు తిరిగి చెక్కులను అందజేశారు. అధికారులు తక్షణమే స్పందించి తప్పులు దొర్లిన చెక్కులను సరిచేసి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా చెక్కులను బ్యాంక్‌లో జరిగిన తప్పు అని చెక్కులను ఆర్డీవో ఆఫీస్‌కి పంపించి సరిచేసి మళ్లీ లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

పండుగొచ్చింది పద బసవన్న

గంగిరెద్దుల ఆటే వారికి జీవనాధారం ● తరతరాలుగా ఇదే వృత్తితో..



గంగిరెద్దును మీద పెట్టుకొని ఆడిస్తున్న దృశ్యం

సాక్షి, సిద్దిపేట/నంగునూరు(సిద్దిపేట)/సంగారెడ్డి జోన్: సంక్రాంతి పండుగ అంటే గుర్తుకు వచ్చేది గంగిరెద్దులు, హరిదాసులు, పిండి వంటకాలు, రంగురంగుల ముగ్గులు. సంక్రాంతి పర్వదినాల్లో ఇంటింటికీ తిరుగుతూ గంగిరె ద్దులను ఆడిస్తారు. తమ ఇంటికొచ్చిన గంగిరెద్దును సాక్షాత్తు నందీశ్వరుడి స్వరూపంగా భావించి ఇంటి వాళ్లు హారతి పట్టి పూజిస్తారు. గంగిరెద్దు ఇంటి ఎదుట వచ్చి ఆశీర్వదిస్తే శుభం కలుగుతుందని పెద్దలు చెబుతుంటారు. పల్లె, పట్టణాల్లో తమ ఇళ్లకు వచ్చిన గంగిరెద్దుల దీవెన తీసుకున్న ప్రజలు తమకు తోచినంత నగదు, బియ్యం, ధాన్యం, వస్త్రాలు దానం చేస్తుంటారు.

ఎస్టీలుగా గుర్తించాలి

అణగారిన వర్గాలను కూడా యాచించి బతుకీడుస్తున్న గంగిరెద్దుల వారిని ఎస్టీలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నారు. తమను బీసీ ఏ కులస్తులుగా గుర్తించడంతో పిల్లలను ఉన్నత చదువులు చదివించలేకపోతున్నామన్నారు. ఈ క్రమంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో అవకాశాలను చేజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగిరెద్దుల ప్రతీ కుటుంబానికి 2 ఎకరాల ప్రభుత్వ భూమిని అందించాలని, ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని, గంగిరెద్దుల వారి పిల్లలకు ఎలాంటి ఎంట్రెన్స్ లేకుండానే స్కూల్, కళాశాలలో సీట్లు కేటాయించాలని కోరుతున్నారు. గంగిరెద్దుల వారికి 7 శాతం రిజర్వేషన్ కల్పించాలని, కళాకారుల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే తాము నివసించే ప్రాంతంలో కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు.



అచ్చంపేటలో డేరాలు వేసుకొని జీవనం కొనసాగిస్తున్న గంగిరెద్దుల కుటుంబాలు

సదాశివపేటలో 11 కుటుంబాలు

సదాశివపేట మండల పరిధిలోని రేలపల్లి గ్రామానికి చెందిన 11 కుటుంబాలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పర్యటిస్తుంటారు. మా తాతల కాలం నుంచి గంగిరెద్దులను సుందరంగా అలంకరణలు చేసి, నృత్యాలూ చేస్తూ, పారితోషికం తీసుకుంటామని వారు వెల్లడించారు.

ఉమ్మడి మెదక్‌లో మొండ్రాయిలోనే అధికంగా..



ఇంటింటికీ తిరుగుతూ ..

ఉమ్మడి మెదక్ జిల్లాలో ముండ్రాయి గ్రామంలోనే అత్యధికంగా గంగిరెద్దుల వారు నివాసం ఉంటున్నారు. నంగునూరు మండలంలోని ముండ్రాయి, గట్లమల్యాల, నాంచారిపల్లి, కొమురవెల్లి, హుస్నాబాద్, నర్సాపూర్, మర్కాపురం, ధర్మారం, వెల్దుర్తి, ధర్మాజీపేట, మద్దూరు ఇలా ఈ గ్రామాల్లో సుమారుగా 350 కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారు. గంగిరెద్దులను ఆడిస్తూ జీవనోపాధి కోసం వీరంతా పిల్లలతో వలసలు వెళ్లి జీవనం వెళ్లదీస్తున్నారు. వీరితోనే బసవన్నల కాలం అయిపోనుంది. భవిష్యత్‌లో వారి తరాల వచ్చేది సందేహమే.

9 నెలలపాటు సంచారమే



గంగిరెద్దుతో సిద్దిపేట నుంచి దుబ్బాక వైపు వెళ్తున్న మహిళలు

గంగిరెద్దుల అలంకరణ ఆకట్టుకునేలా ఉంటుంది. ఉన్నంతలో అందంగా తీర్చిదిద్దుతారు. బట్టలను బొంతలుగా కుట్టి, వాటికి అద్దాలను అమరుస్తారు. మరింత ఆకర్షణ కోసం చెమ్కీ దండలు జత చేసి, మూపురం నుంచి తోక వరకూ కప్పుతారు. ప్రతీ సంవత్సరం ఆగస్టు నుంచి ఏప్రిల్ వరకు గంగిరెద్దుల వారి సంచారం కొనసాగిస్తారు. ప్రతీ ఊరిలో చివర ప్లాస్టిక్ కవర్లతో డేరాలు వేసుకొని అక్కడే వంట చేసుకుంటారు. చిమ్మ చీకట్లో వారి కాపురం. వేకువనే మకాం నుంచి బయల్దేరి మధ్యాహ్నం వరకు ఇంటింటా తిరిగి భిక్షాటన చేస్తారు. ఇలా మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ, వరంగల్, హైదరాబాద్ తిరుగుతుంటారు. ఎద్దుల ధరలు పెరగడంతో వాటిని కొనుగోలు చేసేంత డబ్బులు లేకపోవడంతో డోలు, సన్నాయిలనే పట్టుకొని తిరుగుతున్నారు. వచ్చిన డబ్బుతో వృద్ధులు, చిన్నపిల్లలు సంవత్సరాంతం గడవక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఎస్టీలోనైనా చేర్చాలి



మా పిల్లలు.. ఇప్పుడిప్పుడే ఉన్నత విద్య వైపు అడుగులు వేస్తున్నారు. మాకు రిజర్వేషన్‌లు లేకపోవడంతో వెనుకబాటుకు గురవుతున్నాం. ఎస్టీలోనైనా చేర్చండి అలా సాధ్యం కాకపోతే ఎంబీసీలో మాకు 7శాతం రిజర్వేషన్ కల్పించాలి. భిక్షాటన చేస్తే మా జీవనం కొనసాగుతుంది. ఎద్దుల ధరలు బాగా పెరగడంతో కొత్తగా కొనుగోలు చేసే అంత డబ్బులు మా దగ్గర లేవు. ప్రభుత్వం మమ్మల్ని అన్ని విధాలుగా ఆదుకొని మాకు అండగా నిలవాలి.

- ఎం.మల్లేశం, జిల్లా అధ్యక్షుడు, గంగిరెద్దుల సంఘం

ఓ తల్లి పెడుతుంది.. ఒకరు పెట్టరు



ఐదు నెలల నుంచి మేము ఊరూరూ తిరుగుతూ భిక్షాటన చేస్తున్నాం. ఇప్పుడు అచ్చంపేటలో ఉన్నాం. ఓ తల్లి బియ్యం.. డబ్బులు ఇస్తుంది... ఓ తల్లి ఇవ్వదు.. ఆ రోజుకు రూ.300 వరకు వస్తాయి. కొంత తిండికి పెట్టుకుంటాం.. మిగతావి ఖాళీగా ఉన్నప్పుడు, ఏమీ డబ్బులు రాకపోతే వాటితో తింటాం. మా మాదిరిగా మా పిల్లలు ఇబ్బందులు పడొద్దని వారిని చదివిస్తున్నాం. ప్రభుత్వం మాకు రిజర్వేషన్‌లు కల్పించాలి.

-అవుల యాకయ్య, ధర్మారం

ఆటకు ఆదరణ కరువైంది



మా తాతలు, నాన్నలు గంగిరెద్దులు ఆడించి వచ్చే డబ్బులతో మమ్మల్ని పెంచారు. చిన్నతనంలో వారితో గంగిరెద్దులు ఆడించేందుకు వెళ్లే వాన్ని. ప్రస్తుతం గంగిరెద్దుల ఆటకు ఆదరణ కరువు కావడంతో గ్యాస్ స్టవ్, మిక్సీలు, తదితర ఎలక్ట్రానిక్ వస్తువులు రిపేరు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న.

- జిడ్డి సారయ్య, గంగిరెద్దుల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, ముండ్రాయి

ఖాళీ సమయాల్లో ఇతర పనులు



సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నెల రోజులపాటు గ్రామాల్లో తిరుగుతాము. ప్రతి ఒక్కరూ చాలా బాగా స్వాగతిస్తారు. గంగిరెద్దులతో నృత్యాలు చేయిస్తూ, వారి చేతుల మీదుగా పారితోషికం తీసుకుంటాం. ఖాళీ సమయాల్లో ఇతర పనులు చేసుకుంటాం.

-సాయిలు, గ్రామం, రేలపల్లి, సదాశివపేట మండలం

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న సీఐ రంగాకృష్ణ

మనోహరాబాద్(తూప్రాన్): మహిళ హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ సీఐ రంగాకృష్ణ తెలిపారు. ఆయన కథనం మేరకు.. బిహార్ రాష్ట్రం ముజఫర్‌పూర్‌కు చెందిన సూరజ్‌కుమార్ చంద్రవంశీ రిక్షా నడిపేవాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. 2022లో రజినీదేవి అనే మహిళతో పరిచయం ఏర్పడి ఆమెతో సహజీవనం చేశాడు. 2023 అక్టోబర్ నెలలో మనోహరాబాద్ మండలంలోని ముప్పిరెడ్డిపల్లి, కాళ్లకల్ శివారులోని ఓ కంపెనీకి వచ్చి భార్యాభర్తలుగా చెప్పి అక్కడే ఉంటూ పని చేస్తున్నారు. డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవలు వచ్చాయి. నవంబర్ 18న కిరాణా సామగ్రి కొనుగోలు చేసి దారిలో సూరజ్‌కుమార్, రజినీదేవి మద్యం సేవించారు. గదికి వచ్చాక మళ్లీ డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రేకుడైన సూరజ్‌కుమార్ ఆమెను హత్య చేసి గదికి తాళం వేసి ఢిల్లీ పారిపోయాడు. 3న తూప్రాన్ సీఐ రంగాకృష్ణ, మనోహరాబాద్ ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తమ సిబ్బందితో కలిసి అక్కడే నిందితుడిని శుక్రవారం పట్టుకొని శనివారం రిమాండ్‌కు తరలించామన్నారు.

భార్యను కొట్టిన కేసులో రౌడీ షీటర్

మిరుదొడ్డి(దుబ్బాక): రౌడీ షీటర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ తెలిపారు. శనివారం ఆయన కథనం మేరకు.. మండల పరిధిలోని కూడవెల్లి గ్రామానికి చెందిన కోండ్ర కనకయ్య భార్య కళావతి కొంత కాలంగా కుటుంబ కలహాలతో విడిపోచి పుట్టిల్లు దుబ్బాక మండలం బల్వంతాపూర్‌లో నివసిస్తోంది. రెండు నెలల కిందట గ్రామంలో తనకున్న వ్యవసాయ భూమిని సాగు చేయడానికి పిల్లలతో సహా మళ్లీ కూడవెల్లికి వచ్చి ఒంటరిగా ఉంటోంది. డిసెంబర్ 21న భార్యపై కనకయ్య విచక్షణా రహితంగా దాడి చేశాడు. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స కోసం సిద్దిపేట జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కనకయ్యపై కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిపై గతంలో ఇదే పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్‌గా పలు కేసులు నమోదైనట్లు వెల్లడించారు.

తల్లిదండ్రుల రోడ్డు ప్రమాదాన్ని ఆసరాగా చేసుకొని..

- బాలికపై సామూహిక అత్యాచారం
- ఇద్దరు యువకులు అరెస్ట్

చేగుంట(తూప్రాన్): తల్లిదండ్రులు రోజువారి జీవనోపాధికి వెళ్లగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.. ఇద్దరినీ కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లగా.. వీరి కుమార్తె 16 ఏళ్ల బాలికను ఇంటి వద్దే ఉంచారు. దీన్ని ఆసరాగా చేసుకున్న అదే గ్రామానికి చెందిన యువకులు ఆ బాలికపై సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఈ ఘటన మాసాయిపేట మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కథనం మేరకు.. మాసాయిపేట మండలం నడిమి తండాకు చెందిన 16 ఏళ్ల బాలిక తల్లిదండ్రులు గ్రామాల్లో మురుమురాలు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం తల్లిదండ్రులు ఇద్దరూ తూప్రాన్ శివారులో రోడ్డు ప్రమాదానికి గురై గాయపడ్డారు. సమాచారం అందుకున్న బాలిక సోదరుడు, బాబాయ్ వారిని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాలిక నడిమితండాలోని పూరిగుడిసెలో రాత్రి ఒంటరిగా నిద్రిస్తుండగా తండాకు చెందిన లకావత్ ప్రవీణ్, చెట్ల తిమ్మాయిపల్లి గ్రామానికి చెందిన బండెల రాజు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అప్పుడే బాలిక బాబాయ్ రావడంతో ఇద్దరు నిందితులు అక్కడే దాక్కున్నారు. అదే రాత్రి తండావాసుల సాయంతో పోలీసులకు సమాచారం అందించగా వారు వచ్చి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థులు శోధించే పద్ధతులను అలవర్చుకోవాలి

రిటైర్డ్ ఎస్పీ, ఓఎస్‌డీ మల్లారెడ్డి

- సమాజంలో యువత పాత్రపై ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

నర్సాపూర్ రూరల్: యువత శోధించి సాధించే పద్ధతులను అలవర్చుకోవాలని రిటైర్డ్ ఎస్పీ, ప్రస్తుత ఓఎస్‌డీ(ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) మల్లారెడ్డి విద్యార్థులకు సూచించారు. కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నర్సాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 'నేటి సమాజంలో యువత పాత్ర' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువకులు దేశ స్వతంత్ర్యం కోసం ప్రాణ త్యాగం చేసిన భగత్ సింగ్ లాంటి యోధులను ఆదర్శంగా తీసుకొని ముందుకు నడవాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా అన్ని రంగాల్లో యువత అభివృద్ధి చెందాలన్నారు. దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ, భగత్ సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి మహనీయుల చరిత్రను విద్యార్థులకు వివరించారు. నర్సాపూర్ ప్రభుత్వ కళాశాలలో చదువుకుంటూ ప్రతీయేటా అన్ని గ్రూపుల్లో ప్రతిభ కనబర్చే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు ఇచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు.

నేరాలపై అవగాహన తప్పనిసరి..

జిల్లా గ్రంథాలయ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. యువత సరైన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. యువత అనుకుంటే ఏదైనా సాధించవచ్చన్నారు. యువత సైన్స్ అండ్ టెక్నాలజీ పై అవగాహన పొందాలన్నారు. నర్సాపూర్ సీఐ జాన్ రెడ్డి మాట్లాడుతూ యువత సెల్ ఫోన్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కుటుంబ సభ్యులతోపాటు తెలిసిన వారికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. నేటి యువత తమ బాధ్యతలను సవాలుగా తీసుకొని ముందుకు కదలాలని కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ లక్ష్మికాంతం అన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ గుప్తా, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగరాజ్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సూరిక్రిష్ణ

జహీరాబాద్: చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జహీరాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సూరి క్రిష్ణ అన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలని, పెద్దలను గౌరవించాలని, ఉన్నత చదువులు చదువుకోవాలని సూచించారు. నిత్య జీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదురు కాకుండా ఉండడానికి, సమస్యలు వస్తే వాటిని అధిగమించేందుకు చట్టాలు తోడ్పడుతాయని పేర్కొన్నారు. సమాచార హక్కు చట్టం, మోటారు వాహనాలు, బాలకార్మికుల నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్, న్యాయవాదులు విజయ్‌కుమార్, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతూ బాలిక మృతి



వెన్నెల (ఫైల్)

నంగునూరు(సిద్దిపేట): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పిల్లి వెన్నెల (17) ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన మిట్టపల్లి లక్ష్మణ్ తనను ప్రేమించాలని కొన్ని నెలలుగా బాలికను వేధిస్తున్నాడు. వేధింపులు తట్టుకోలేక 13 రోజుల కిందట బాలిక ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబీకులు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైద్రాబాద్‌కు తరలించగా శనివారం మృతి చెందింది. ఈ విషయమై రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్‌ను వివరణ కోరగా బాలిక మృతిపై పోక్సో కేసు నమోదు చేశామని, బాలిక తండ్రి ఫిర్యాదు చేయలేదని పలుమార్లు సమాధానం చెప్పిదాటవేశారని తెలిపారు. గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

వేగంగా వచ్చి.. పొలాల్లోకి దూసుకెళ్లి

ప్రాణాలతో బయటపడ్డ వైద్య దంపతులు



వరి పొలంలో కారు

శివ్వంపేట(నర్సాపూర్): కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన శివ్వంపేట మండలంలోని శంకర్ తండా వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వెల్దుర్తి మండల కేంద్రంలో నివాసముండే వైద్య దంపతులు శ్రీకాంత్, లక్ష్మీ స్థానికంగా శ్రీలక్ష్మీ నర్సింగ్‌హోమ్ ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. శనివారం లక్ష్మీ బీదర్ వెళ్తుంది. ఇందుకు కోసం సంగారెడ్డిలో బస్సు ఎక్కించేందుకు ఇద్దరూ కారులో బయలుదేరారు. మార్గమధ్యలో మండలంలోని శంకర్ తండా వద్దకు రాగానే వీరి అతివేగంగా వచ్చి అదుపుతప్పి రోడ్డు పక్కన పంట పొలాల్లో పల్టీ కొట్టింది. స్థానిక రైతులు దంపతులిద్దరిని కారులో నుంచి బయటకు తీసుకొచ్చారు. సీటు బెల్టు ధరించడంతో ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

టాలెంట్ టెస్ట్‌లో సత్తా

సిద్దిపేటజోన్: స్థానిక టీటీసీ భవన్‌లో శనివారం జిల్లా సాంఘీక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరమ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. జెడ్పీ, కేజీబీవీ, టీఎస్ మోడల్ స్కూల్ ఇంగ్లిషు, తెలుగు మీడియంకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీఈబీ సెక్రటరీ షౌకత్ అలీ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో పోటీతత్వం పెంపొందించేందుకు టాలెంట్ టెస్ట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో సర్టిఫికెట్లు అందజేశారు.

కుక్కల దాడిలో మేకలు మృతి



మృత్యువాత పడిన మేకలు

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో వీధి కుక్కలు రెచ్చిపోయాయి. గ్రామానికి చెందిన మహిపాల్ రెడ్డి మేకల దొడ్డిలో శుక్రవారం అర్ధరాత్రి మేకల మందపై ఒక్కసారిగా దాడి చేయడంతో 20 జీవాలు మృత్యువాత పడ్డాయి. దీంతో రైతు మహిపాల్ రెడ్డి కుటుంబం కన్నీరు మున్నీరయ్యారు. పశు వైద్యాధికారి అరుణ ఘటనా స్థలాన్ని పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తానని తెలిపారు.

ఆటో, టాటా ఏస్ వాహనం ఢీ

నలుగురు మహిళా కూలీలు, ఇద్దరు డ్రైవర్లకు గాయాలు



బోల్తా పడ్డ టాటాఏస్ వాహనం

చిన్నశంకరంపేట(మెదక్): ఆటో- టాటా ఏస్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఆరుగురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మెదక్ మండ లం కాజిపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు మండలంలోని మడూర్ గ్రామంలో వ్యవసాయ వరి నాట్లు ముగించుకొని ఆటోలో స్వగ్రామానికి వెళ్తున్నారు. ఇదే సమయంలో కొల్చారం మండలం ఘణపూర్‌లో మద్యం కాటన్లు తీసుకొని టాటా ఏస్ వాహనంలో నార్సింగి వైన్స్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో కొర్విపల్లి బ్రిడ్జి సమీపంలోకి రాగానే టాటా ఏస్ వాహనం, ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు బోల్తాపడగా, ఆటోలో ఉన్న కూలీలు నాగలక్ష్మి, సంతోష, మమత, రజిత, మహేశ్‌కు గాయాలు అయ్యాయి. అలాగే టాటా ఏస్ డ్రైవర్‌కు తీవ్రంగా గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీస్ లు క్షతగాత్రులను అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చిన్నశంకరంపేట ఎస్‌ఐ నారాయణగౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న లారీ : ఇద్దరికి గాయాలు



రహదారిపై బోల్తాపడిన ట్యాంకర్

తూప్రాన్: నీటి ట్యాంకర్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన 44వ జాతీయ రహదారిపై ఇస్లాంపూర్ గ్రామ చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. జాతీయ రహదారి డివైడర్‌పై ఉన్న మొక్కలను ట్యాంకర్ ద్వారా నీరు పోస్తున్న క్రమంలో వెనుకాల నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తా పడి ఇంజన్‌పై ఉన్న నెంటూరుకు సిద్ధిరాములు, ఇస్లాంపూర్‌కు చెందిన చర్లపల్లి మంజులకు తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.